క్లుప్తంగా

అక్టోబర్ 3న పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

జమ్మలమడుగు రూరల్ : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అక్టోబర్ 3వ తేదీ విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు జరుగనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేంద్రనాథరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎలక్ట్రికల్, మెకానికల్ బ్రాంచిలలో సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. విద్యార్థులు పాలిసెట్ ఎంట్రన్స్ టెస్ట్ రాయకపోయినా సీటు పొందవచ్చునన్నారు. అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు, ధృవీకరణ పత్రాలతో పాటు రూ.5800 ఫీజు తీసుకుని అక్టోబరు 3వ తేదీ పాలిటెక్నిక్ కళాశాలలో హజరుకావలన్నారు. కళాశాలలో విద్యార్థులకు హస్టల్ వసతి సౌకర్యం ఉందన్నారు.

సింహాద్రిపురం..

సింహాద్రిపురం : అక్టోబర్ 3వ తేదీ నుంచి సింహాద్రిపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ కోర్సులలో చేరుటకు 10వ తరగతి పాసైన వారు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9010222184, 9949678581 నెంబర్లను సంప్రదించాలన్నారు.

రేపు ప్రముఖ వైద్యులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురం సమీపంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్ (డాక్టర్ ఇ.సి.గంగిరెడ్డి ఆసుపత్రి) నందు శుక్రవారం ప్రముఖ వైద్యులు డాక్టర్ వడ్లతల ప్రతాప్‌రెడ్డి రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపారు. చెవిలో చీముకారుట, చెవినొప్పి, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వరపేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తలతిరుగుట, తదితర సమస్యలకు సంబంధించి వైద్య సేవలు అందిస్తారన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్యచికిత్సలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ప్రేమ, అనురాగాలకు నిలయం సీఎస్ఐ

కమలాపురం : ప్రేమ అనురాగాలకు నిలయం సీఎస్ఐ (చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా) అని స్థానిక సీఎస్ఐ చర్చి ఫాస్టర్ భరత్ హెరాల్డ్ తెలిపారు. బుధవారం సీఎస్ఐ చర్చి 76 వసంతాలు పూర్తి చేసుకోవడంతో రాయలసీమ డయాసిస్ బిషప్ రెవరెండ్ ఐజాక్ వరప్రసాద్ ఆదేశాల మేరకు పలు కాలనీల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. సంఘ సభ్యులందరూ సీఎస్ఐ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం విందు ఏర్పాటు చేశారు.

ఆప్టిట్యూడ్ రీజనింగ్‌పై అవగాహన

పులివెందుల రూరల్ : పట్టణంలోని జేఎన్టీయూ కళాశాలలో బుధవారం ఆప్టిట్యూడ్ రీజనింగ్ పైన కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర, క్లాస్మెట్ అకాడమి హైదరాబాదుకు చెందిన ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాల ద్వారా ఏపీపీఎస్సీ, యూపీఎస్సీ, తదితర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ అధికారి మురళి, అసిస్టెంట్ ఆఫీసర్ సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులు

కొండాపురం : మండల పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థినులు క్రీడల్లో జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కృష్ణవేణి బుధవారం తెలిపారు. సీనియర్ విద్యార్థునులు వాలీబాల్‌లో పి.నాగవేణి, వి.మనేశ్వరి, అలాగే 3-కే వాక్స్‌లో ఎం.వెంకటలక్ష్మి, ఎస్.సౌమ్య, అలాగే జూనియర్ ఇంటర్ విద్యార్థిని పి.అమరావతి ఎంపికైనట్లు ఆమె తెలిపారు.

అవయవదానం, రక్తదానంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మల్లేశ్వరమ్మ

వేంపల్లె : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవయవదానం, రక్తదానంపై బుధవారం ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, స్నేహిత అమృతహస్తం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ అధికారిణి జీ మల్లేశ్వరమ్మ హాజరై మాట్లాడారు. అవయవదానంతో ఎంతోమందికి ప్రాణాలు నిలపవచ్చునన్నారు. సమాజంలో అవయవదానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని తెలిపారు. అపోహలు తొలగించేందుకు యువత కృషి చేయాలని సూచించారు. అలాగే రక్తదానం చేయడం వల్ల కొత్త రక్తకణాలు ఉత్పత్తి జరుగుతోందన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో రక్తకణాలు ప్రధానపాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, సేవాసమితి అధ్యక్షులు రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీపై సామాజిక తనిఖీలు

- మండల వ్యాప్తంగా 543 పనులు పూర్తి
- రూ.9.27కోట్ల మేర ఉపాధి నిధులు ఖర్చు
- నేటి నుంచి గ్రామాల్లోకి సామాజిక తనిఖీ బృందాలు


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

వేముల : గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీలు చేపట్టనున్నారు. గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు చేసిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు పరిశీలన చేయనున్నారు. ఇందు కోసం సామాజిక బృందాలు వారికి కేటాయించిన గ్రామాల్లోకి వెళ్లి పనులను పరిశీలించి అందులోని లోపాలపై తనిఖీలు నిర్వహించనున్నారు. పనులపై సామాజిక తనిఖీల కోసం చేసిన పనులకు సంబంధించిన వర్క్ ఆర్డర్, ఎంబుక్కులు, పే ఆర్డర్‌లు, మస్టర్లు, మెటీరియల్ ఓచర్లను ఉపాధి సిబ్బంది సిద్ధం చేశారు. వీటిని ఆయా గ్రామాలకు సామాజిక తనిఖీలకు వెళ్లే బృందాలకు అందజేయనున్నారు. వీటి ద్వారా ఆయా గ్రామాల్లో ఏయే పనులు చేశారు. ఎన్ని పనులు చేపట్టారు. ఎంత పేమెంట్ కూలీలకు ఇచ్చారు. అనే విషయాలపై కూలీలతో విచారణతో పాటు క్షేత్రస్థాయి పరిశీలన చేయనున్నారు.

మండల వ్యాప్తంగా 543 పనులు

మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద 543 పనులు చేపట్టినట్లు ఏపీఓ గంగరాజు తెలిపారు. మండల వ్యాప్తంగా 5712 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 3439 కుటుంబాల వారు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. ఉపాధి పనుల్లో 5413 మంది కూలీలు పనులు చేపట్టారు. ఉపాధి ద్వారా పంచాయతీశాఖ ఆధ్వర్యంలో మట్టిరోడ్ల పనులు, పీబీసీ కాలువలో పూడికతీత పనులు, సన్న చిన్నకారు రైతులకు చీనీ, నిమ్మతోటల పెంపకం తదితర పనులు చేపట్టారు. ఈ పనులపై సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు నిర్వహించి నివేదికలు తయారు చేయనున్నారు.

గ్రామాలలో రూ.9.27 కోట్ల మేర ఉపాధి నిధులు ఖర్చు

మండలంలోని గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేపట్టి రూ.9.27 కోట్ల మేర ఉపాధి నిధులు ఖర్చు చేశారు. ఇందులో కూలీలకు సంబంధించి రూ.5.07 కోట్లు, మెటీరియల్‌కు సంబంధించి రూ.4.02 కోట్ల మేర నిధులు ఖర్చు చేశారు. ఈ నిధులను ఏయే పనులకు ఎంత ఖర్చు చేశారన్న రికార్డులను పరిశీలించి తనిఖీలు చేస్తారు. ఆ మేరకు గ్రామాల్లో పనులు జరిగాయో లేదో పరిశీలించి కూలీలతో ఆరా తీయనున్నారు. పని కావాలన్న ప్రతి ఒక్కరికీ ఉపాధిహామీ ద్వారా గ్రామాల్లో పనులు కల్పించారు. ఈ పనులపై గురువారం నుంచి సామాజిక తనిఖీ బృందాలు గ్రామాలకు వెళ్లి రికార్డుల ఆధారంగా పనులను పరిశీలించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని రికార్డులను తనిఖీ బృందాలకు అందజేశామని ఏపీఓ గంగరాజు తెలిపారు.

బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం


లబ్ధిదారులకు జగనన్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం స్థానిక గుంతబజారు సచివాలయ పరిధిలోని మెయిన్ రోడ్డు, పూలఅంగళ్ల సర్కిల్, కచేరిరోడ్డు సమీప ప్రాంతాల్లో నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అధికారుల ద్వారా వెంటనే పరిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, వైస్ చైర్మన్ హాఫీజ్, కమిషనర్ నరసింహారెడ్డి, సీఐ రాజు, కౌన్సిలర్లు శైలజ, పార్నపల్లి కిశోర్, రంగ నాయకులు, ఖాదర్‌బాషా, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, కోఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


రికార్డులను పరిశీలిస్తున్న వ్యసాయ అధికారులు

వేంపల్లె : పట్టణంలోని పలు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో బుధవారం పులివెందుల సహాయ వ్యవసాయ సంచాలకులు అశోక్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్‌లు తనిఖీలు నిర్వహించి పలు రికార్డులను పరిశీలించారు. ధరల పట్టిక, ఎరువుల బస్తాలు, తూకాలు, బిల్ పుస్తకాలు, స్టాకు రిజిష్టర్, ఈ పాస్ మిషన్ పనితీరు, అమ్మకాల వివరాలు, ధరల వివరాలు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు విక్రయించితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యత కలిగిన ఎరువులు, పురుగు మందులు మాత్రమే విక్రయించాలన్నారు. గడువు ముగిసిన సరుకును రైతులకు విక్రయించరాదన్నారు. కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు అందజేయాలని, నిబంధనలు పాటించని దుకాణ యజమానులపై చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, దుకాణ యజమానులు, రైతులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


మార్కెట్‌యార్డులో చీనీకాయలకు వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

పులివెందుల రూరల్ : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప అన్నారు. బుధవారం పులివెందుల వ్యవసాయ మార్కెట్‌కు పులివెందుల ప్రాంతంలోని వివిధ గ్రామాల నుంచి 51 టన్నుల చీనీ కాయలు మార్కెట్‌యార్డుకు రావడంతో మార్కెట్‌యార్డులో చీనీ టన్ను ధర రూ.26,300లు పలికిందని ఆయన తెలిపారు. రైతులు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా పులివెందుల వ్యవసాయ మార్కెట్‌యార్డులో సూట్ లేకుండా చీనీకాయలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. అందులో భాగంగా మార్కెట్‌యార్డులో వేలంపాట ద్వారా వ్యాపారులు చీనీకాయలను కొనుగోలు చేయవచ్చన్నారు. వేలంపాట ద్వారానే అధికారులు చీనీకాయలను కొనుగోలు చేసి ఇతర మార్కెట్‌లకు తీసుకుని వెళ్తారని, వాటి ద్వారా అటు రైతులకు, ఇటు వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుందన్నారు.

భక్తి శ్రద్ధలతో జష్నే మిలాద్


ఆసారె షరీఫ్‌ను ప్రారంభిస్తున్న పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షా ఖాద్రి

కమలాపురం : పట్టణంలో వెలసిన శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి దర్గాలో జష్నే మిలాదున్నబి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం రాత్రి దర్గా పీఠాధిపతి సజ్జాద్-ఎ-నషీన్ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్త జన సందోహం నడుమ మిలాద్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి నివాసం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చిన పూల చాదర్లను స్వామి వార్ల మజార్లపై సమర్పించి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన దాదాపు 100కు పైగా వస్తువులను ప్రదర్శనకు (ఆసారే షరీఫ్) ఉంచారు. భక్తులు వాటిని చూసేందుకు ఆసక్తి చూపారు. అనంతరం రాత్రి నిర్వహించిన బయాన్‌లో భక్తులను ఉద్దేశించి పీఠాధిపతి మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త జననం, మరణం ఒకే రోజు జరిగాయని, ఆ రోజునే మనం మిలాదున్నబిగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. దస్తగిరి స్వామి, మౌలానా స్వాములు మిలాద్ ప్రత్యేకతను వివరించారు. అనంతరం భక్తులకు గఫారియా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలోని జామీయా మసీదు పీఠాధిపతి సయ్యద్ షా సాదిక్‌పాషా ఖాద్రీ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన జ్ఞాపికలకు గంధోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం రాత్రి మెయిన్ బజార్‌లో ఉన్న ఆస్థానయే జామియాలో భక్తులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గురువులు ఇర్షాద్ జానీఖాద్రీ, సయ్యద్‌షా అసద్ పాషాఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

బుడ్డ శనగ విత్తనాలు పంపిణీకి సిద్ధం


మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ రాష్ట్ర ప్రధాన సలహాదారుడు సంబటూరు ప్రసాదర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : రబీ సీజన్‌కు సంబంధించి బుడ్డ శనగల విత్తనాలు రైతులకు పంపిణీ చేయడానికి జిల్లాలో ప్రస్తుతం 33 వేల క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని ఉద్యానవన శాఖ రాష్ట్ర ప్రధాన సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుల సంక్షేమపై అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత ప్రభుత్వం రైతులకు 25 శాతం సబ్సిడీతో 25 కిలోల బుడ్డ శనగ విత్తనాలు ఇచ్చేదని అయితే జగనన్న ప్రభుత్వం రైతులకు 40 శాతం సబ్సిడీతో 40 కిలోల బుడ్డ శనగ విత్తనాలను అందిస్తోందన్నారు. ఐదు ఎకరాలున్న రైతులకు 200 కిలోలు దాక విత్తనాలు అందిస్తున్నామన్నారు. రైతులు ఆర్‌బీకేలలో వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. బుడ్డ శనగ విత్తనాలతో పాటు మినుము, పెసర, ఉలవలు, జొన్నలు, మొక్క జొన్నలు అందజేస్తారన్నారు. అలాగే లక్ష పదివేల క్వింటాళ్ల విత్తనాలు మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ డీఎం జగదీష్, ఎర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మినుము, పెసర విత్తనాల పంపిణీ


విత్తనాలను రైతులకు అందిస్తున్న మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి

వీరపునాయునిపల్లె : రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మినుము, పెసర పంటకు సంబంధించి విత్తనాలను 80 శాతం రాయితీతో అందిస్తున్నాడని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. ఎస్.పాలగిరి సచివాలయ పరిధిలోని రైతులకు ఆయన బుధవారం విత్తనాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్లో వర్షాభావ దృష్ట్యా పంటలు సాగుచేయలేక పోయిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు పెసర, మినుములను అందజేశామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు మాట్లాడుతూ మండలంలో టిబిజి-104 రకం మినుములు 110 క్వింటాళ్లు, ఐపిఎం 2-14 రకం పెసలు 19.80 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనం కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి బయోమెట్రిక్ ద్వారా విత్తనాలను పొందాలన్నారు. ఒక్కో ఎకరానికి 8 కేజీలు చొప్పున 5 ఎకరాల వరకు అందిస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు వీరయ్యయాదవ్, గోనుమాకులపల్లె సర్పంచు సురేంద్రకుమార్ యాదవ్, రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

వేంపల్లె : స్థానిక ముతరాసు వీధిలో బుధవారం వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం ఊరేగింపు సమయంలో అదే వీధికి చెందిన ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. నిమజ్జన అనంతరం సాయంత్రం శివశంకర్ వర్గానికి చెందిన లోకేష్, చంద్రశేఖర్‌లు నరసింహులు వర్గానికి చెందిన ఓం ప్రకాష్, ఓబులేసుల మధ్య మాట మాట పెరిగి కత్తితో దాడికి దిగారు. దీంతో లోకేష్, శివశంకర్, చంద్రశేఖర్‌లకు కత్తి గాయాలయ్యాయి. నరసింహులు వర్గానికి చిన్న చిన్న దెబ్బలు తగిలాయి. గాయాలైన లోకేష్, శివశంకర్, చంద్రశేఖర్ లను వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో మెరుగైన సేవలు


జమ్మలమడుగు : ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పులివెందుల టౌన్ : ప్రతి కుటుంబానికి వైద్య సేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో ఆయన సీహెచ్‌ఓ, ఏఎన్ఎం, వలంటీర్లతో సమావేశం నర్విహించి మాట్లాడారు. ప్రతి ఇంటిని మూడుసార్లు సందర్శించి ప్రతి పౌరుడికి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. బి.పి, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, డెంగ్యూ, మలేరియా, గళ్ల పరీక్షలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించాలన్నారు. వైద్యం కోసం అవసరమైన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేసేందుకు నలుగురు వైద్యులచే వార్డు సచివాలయ పరిధిలోని పట్టణంలో వైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా జమ్మలమడుగు మున్సిపాలిటీలోని 10 సచివాలయాల పరిధిలో అర్బన్‌హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. కన్నెలూరు అర్బన్‌హెల్త్ సెంటర్ పరిధిలో 80 శాతం సర్వే పూర్తైనట్లు తెలిపారు. ప్రజలకు అక్టోబర్ 3వ తేదీన మెగా వైద్యశిబిరాన్ని 11వ తేదీన నాగులకట్ట పరిధిలో ఉన్న వారికి వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు.

చెన్నూరులో..

చెన్నూరు : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేద ప్రజలకు మరింత వైద్య సదుపాయాలు అందుతాయని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎస్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఓబులంపల్లె, రామనపల్లె గ్రామాలలో జగనన్న ఆరోగ్య సురక్షపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. వలంటీర్లు, వైద్య సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుని వారి పేర్లను నమోదుచేసి ఫామిలీ డాక్టర్‌కు తెలపాలన్నారు. వారు వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ ఎర్రసాని నిరంజన్‌రెడ్డి, సర్పంచ్‌లు చల్లా వెంకటసుబ్బారెడ్డి, దీపం స్వప్నిక, సొంట్లం నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని నూతన మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారాయన అర్బన్ హెల్త్ కేంద్రంలో వైద్య సేవలను పరిశీలించి మాట్లాడారు. పట్టణ వైద్య ఆసుపత్రిలో ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం అందిస్తాం


బాధితులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎం. హర్షవర్ధన్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ఇటీవల కురుస్తున్న వర్షాలకు పట్టణపరిధిలోని 1వ వార్డు ప్రకాశ్‌నగర్ కాలనీలో నివాసముండే కృష్ణయ్య ఇంటి పైకప్పు కూలిపోయిందన్న విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్‌లు కూలిన మిద్దెను బుధవారం పరిశీలించారు. బాధితుడికి ఇంటిని మంజూరు చేయిస్తామన్నారు. సాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని వారు తహసీల్దార్ నాగేశ్వరరావును ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎరికలరెడ్డి, ఆర్ఓ గంగిరెడ్డిలు పాల్గొన్నారు.

ఉత్త ఉపాధ్యాయురాలుకు సన్మానం


రాఘవేంద్రమ్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

లింగాల : స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం మండలంలోని గుణకనపల్లె ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఎన్.రాఘవేంద్రమ్మ ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు అందుకున్న సందర్భంగా ఆమెను మండల విద్యాశాఖ అధికారులు నారాయణరెడ్డి, ప్రసాద్‌లు సన్మానించి మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయురాలు విద్యార్థులకు ఉత్తమ బోధనలను అందించి మరిన్ని అవార్డులను పొందాలన్నారు. కార్యక్రమంలో లింగాల, పెద్దకుడాల, వెలిదండ్ల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాఘవేంద్రారెడ్డికి ఉత్తమ విస్తరణ అధికారి అవార్డు


అవార్డు అందుకుంటున్న ఉద్యానవనశాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందులలో ఉద్యానవనశాఖ అధికారిగా పనిచేస్తున్న రాఘవేంద్రారెడ్డికి ఉత్తమ విస్తరణ అధికారి అవార్డును అందజేశారు. బుధవారం తెలంగాణ రాష్ట్రంలోని రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో యూనివర్శిటీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ కేంద్ర ప్రభుత్వ సంస్థ అయినటువంటి ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ సదరన్ రీజియన్, హైదరాబాదు వారు నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నెక్స్ జనరేషన్ ఎక్స్‌టెన్షన్ ఫర్ రివాల్వింగ్ రీసైలెంట్ అగ్రి ఏకో సిస్టమ్స్ అనే అంశం మీద జాతీయస్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో భారతదేశంలోని దక్షిణాది రాష్ట్రాలలో వ్యవసాయ, అనుబంధ శాఖల్లో ఉత్తమ విస్తరణ సేవలు అందించిన అధికారులకు అవార్డులు అందజేశారు. అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉద్యానవనశాఖ తరపున ఉత్తమ విస్తరణ సేవలు అందించినందుకు పులివెందుల ఉద్యానఅధికారి గువ్వా రాఘవేంద్రారెడ్డికి విస్తరణ అధికారి అవార్డును బెస్ట్ ఎగ్జామినేషన్ ఆఫీసర్ జగన్‌మోహన్‌రెడ్డి, డైరెక్టర్ సుధారాణి, తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్శిటీ డాక్టర్ సదామతేజీ, మాజీ వ్యవసాయ ప్లానింగ్ కమిషనర్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు.

శ్రీచైతన్య హైస్కూల్‌లో కలర్స్ డే వేడుకలు


కలర్స్ డే వేడుకల్లో చిన్నారులు

వేంపల్లె : స్థానిక శ్రీ చైతన్య హైస్కూల్‌లో కలర్స్‌డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అలాగే చిన్నారుల నృత్యప్రదర్శనలు అందరినీ ఆకట్టుకుంది. కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

చెన్నూరు : స్థానిక మండల పరిషత్ సభా భవనంలో బాల్య వివాహాల నిర్మూలనపై సీడీపీఓ రమాదేవి సమావేశం నిర్వహించి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను చదివించకుండా చిన్న వయసులోనే వివాహాలు చేస్తున్నట్లు తెలిసిందని ఇలాంటి వివాహాలు ఎవరైనా జరిపిస్తే వెంటనే 1098కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహాలు జరిపించాలన్నారు. లేకుంటే సహకరించిన వారికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష లక్ష రూపాయలు జరిమానా విధిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎస్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో సుబ్రహ్మణ్యంశర్మ, ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ, ఏపీఎం గంగాధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గురమ్మ పాల్గొన్నారు.

సింహాద్రిపురం : బిదినంచెర్ల సచివాలయ పరిధిలో బుధవారం బాల్యవివాహాల నిరోధక కమిటీ ఏర్పాటు చేశారు. తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్ఐ, ఎంఈఓ, ఐసీడీసీ సూపర్వైజర్‌లు మండల బాల్యవివాహాల నిరోధక కమిటీగాను, అలాగే విలేజ్ లెవెల్ కమిటీ గ్రామ సర్పంచ్ కమిటీ చైర్మన్‌గా, సచివాలయ మహిళా పోలీస్ కన్వీనర్‌గా, మెంబర్స్‌గా గ్రామ పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో, స్కూల్ హెచ్ఎం, ఏఎన్ఎం, మండల సమైఖ్య సభ్యురాలు, వార్డుమెంబర్, అంగన్‌వాడీ వర్కర్లు కమిటీగా ఏర్పాటు చేశారు. ఈ కమిటీల ద్వారా బాల్యవివాహాలను అరికట్టాలని ఐసీడీసీ సూపర్‌వైజర్ వసంతకుమారి తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో ఏఎన్ఎం, ఎస్‌హెచ్‌జీ మెంబర్స్ పాల్గొన్నారు.

సన్మార్గంలో పయనిస్తేనే ప్రశాంతత


పండ్లు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న పీఠాధిపతి

జమ్మలమడుగు : ప్రతి మనిషి సన్మార్గంలో పయనిస్తేనే వారు ప్రశాంత జీవనానికి అలవాటు పడుతారని ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్ షా గౌస్‌పీరాఖాద్రీ తెలిపారు. మిలాద్‌ఉన్నబీని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, జ్యోతిమనోవికాస కేంద్రంలోని మానసిక వికలాంగులకు బ్రెడ్లు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఫిక్ పాషాసయ్యద్‌షా అత్తహార్ ఖాద్రీ, హాఫీజ్ మస్తాన్, సాబీర్, ఆస్థానయే కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మహమ్మద్ ప్రవక్త జ్ఞాపికల ప్రదర్శన

గురువారం సాయంత్రం ఆస్థానయే గౌసియాలో మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన జ్ఞాపికల ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉదయం శాంతి ర్యాలీ ఉంటుందన్నారు.